ఘనంగా రేణుకామాత కల్యాణం

కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

ఊరేగింపుగా వస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట, ఫిబ్రవరి 11 : రామాయంపేట పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఘనంగా కల్యాణ మహోత్సవాలను నిర్వాహకులు జరిపించారు. మంగళవారం మల్లికార్జున స్వామి జాతరలో భాగంగా ఆలయంలోని రేణుకాఎల్లమ్మకు పట్నాలు గీసి కల్యాణ కార్యక్రమాలను చేపట్టారు. పట్టణ యాదవ సంఘం అధ్వర్యంలో నిర్వాహకులు రేణుకా ఎల్లమ్మకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయంలో ఎల్లమ్మకు కులబాంధవులు పెద్ద ఎత్తున హాజరై కల్యాణంలో పాల్గొన్నారు. మల్లన్న జాతరకు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి చేరుకుని రేణుకా కల్యాణంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ర్యాలీ గా వచ్చిన మాజీ ఎమ్మెల్యే జాతరలో ప్రత్యేక ఆకర్షణగా ఉన్నారు. జాతరలో తిను బండారాలను కొనుగోలు చేశారు. జాతరకు సుమా రు 5 వేల మంది వరకు భక్తులు చేరుకున్నట్లు నిర్వాహకులు అంచనా వేశారు. రామాయంపేట పట్టణంలోనే దేదీప్యమానంగా జరిగిన ఉత్సవాలకు పట్టణ ప్రజలతో బాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు.

ఆలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించింది కేసీఆరే : పద్మాదేవేందర్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ అధినేత కేసీఆరేనని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ కల్యాణానికి హాజరై పూజలు చేశారు. అనంతరం జాతరలో వివిధ వస్తువులను కొనుగోలు చేశారు. జాతరలో పద్మాదేవేందర్‌రెడ్డి తిరుగడంతో జాతరలో ప్రత్యేక ఆకర్షణగా కనిపించింది.

మెదక్ భరోసా కేంద్రం సందర్శన

మెదక్ భరోసా కేంద్రాన్ని సందర్శించిన అధికారులు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 11 : జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రాన్ని బెంగళూరు సిటీ పోలీస్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ క్షమా మిశ్రా తన బృందంతో మంగళవారం సందర్శించారు. కేంద్రం కార్యకలాపాలు, బాధితుల సహాయక వ్యవస్థ, న్యాయపరమైన చర్యలు గురించి అధ్యయనం చేశారు. బెంగళూరు సిటీ పోలీస్ అధికారుల బృందం వెంట మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ శ్రీధర్, భరోసా పీఎంయూ రెంజీ ఉన్నారు. భరోసా సెంటర్ లీగల్ అడ్వైజర్ శ్వేత, కో-ఆర్డినేటర్ సౌమ్య ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు మాసాయిపేట విద్యార్థిని

బాలికను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

వెల్దుర్తి, ఫిబ్రవరి 11 : జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండల కేంద్రమైన మాసాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని అక్షిత ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ధర్మపురి తెలిపారు. మంగళవారం పాఠశాలలో పీఈటీ శ్యాంసుందర్, ఉపాధ్యాయులు హరిరంజన్‌శర్మ, రాజేశ్వర రావులతో కలిసి విద్యార్థిని అక్షితను అభినందించారు. ఈ సందర్భంగా పీఈటీ మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 16 వరకు మహారాష్ట్రలోని ఛత్రపతి శివాజీ సంభాజీనగర్, ఔరంగాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి అండర్-14 బాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ జట్టుకు అక్షిత ఎంపికయ్యిందని, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబర్చి పాఠశాలకు పేరు తీసుకురావాలని హెచ్ఎం, ఉపాధ్యాయులు కోరారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

శివ్వంపేట, ఫిబ్రవరి 11 : ఈ నెల 15న శివ్వంపేటలో నిర్వహించే సేవాలాల్ మహరాజ్ జయంతిని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ ఎస్టీసెల్ మండలాధ్యక్షుడు రవినాయక్ కోరారు. ఆరేండ్లుగా తాను సేవాలాల్ మహరాజ్ జయంతి జరుపుతున్నానని, అన్ని గ్రామపంచాయతీల్లో బోగ్‌బండార్ జరుపుకోవాలన్నారు. 15న శివ్వంపేటలో భారీ ర్యాలీ నిర్వహించి నర్సాపూర్‌కు తరలివెళ్లనున్నట్టు, పెద్ద సంఖ్యలో గిరిజనులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న కలెక్టర్

సదస్సులో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 11 : ఢిల్లీలో జరిగిన తదుపరి తరం పరిపాలన సంస్కరణల అంతర్జాతీయ సదస్సుకు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ప్రత్యేక ఆహ్వానం మేరకు పాల్గొన్నట్లు మంగళవారం కలెక్టర్ కార్యాలయం తెలిపింది. కలెక్టర్‌గా మూడు జిల్లాలో పనిచేసిన పాలనాపరమైన అనుభవాలను దేశ విదేశీ ప్రతినిధులతో పంచుకున్నారు. ఈ సమావేశంలో దేశ విదేశాల పరిపాలన సంబంధిత ప్రతినిధులు హాజరయ్యారు.

పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 11 : ఈ నెల 27న జరుగనున్న మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేశ్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం ఐడీవోసీ కార్యాలయ సమవేశ మందిరంలో అధికారులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి

మనోహరాబాద్, ఫిబ్రవరి 11 : బీసీలకు అన్యాయం చేయాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోమని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు రిజర్వేషన్లకు చట్ట బద్ధత కల్పించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శేఖర్‌గౌడ్ అన్నారు. మనోహరాబాద్ మండలం జీడిపల్లిలో మంగళవారం వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి బీసీ రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి కాకుండానే ఎన్నికలకు పోవాలని చూస్తున్నారన్నారు. గతంలో కూడా బీసీలను అణగతొక్కిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. మండల నాయకుడు దాసరి నరేశ్ ముదిరాజ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు రతన్‌లాల్, మాజీ సర్పంచ్ నాగభూషణం, ఉప సర్పంచ్ మహేందర్‌గౌడ్, నాయకులు కత్తుల వెంకటేశ్, పంజా భిక్షపతి, శ్రీనివాస్, కుంట రాజు, లక్ష్మణ్‌యాదవ్, వీరేశ్‌గౌడ్, నందు, ఆంజనేయులు, రాము పాల్గొన్నారు.

నిఘా నేత్రాలతో నేరాలకు చెక్

ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

కొల్చారం, ఫిబ్రవరి 11 : నిఘానేత్రాలతో నేరాలకు చెక్ పెట్టవచ్చని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని ఏడపాయల టీజంక్షన్ వద్ద మెదక్ హైదరాబాద్ జాతీయ రహదారిపై పోతంశెట్టి పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దుకాణ సముదాయాల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ఎస్పీ ప్రారంభించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేసిన కొల్చారం ఎస్సై గౌస్‌ను అభినందించి, శాలువాతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఏడపాయల దేవస్థానానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తుండడంతో పోతంశెట్టిపల్లి అభివృద్ధి చెందుతుందని, తద్వారా చిరు వ్యాపారస్తులకు, ఆటో డ్రైవర్లకు ఉపాధి దొరుకుందన్నారు. భక్తుల సంక్షేమం, రోడ్డు భద్రత, దొంగతనాల నివారణా దృష్ట్యా సీసీ కెమెరాలతో మేలు జరుగుతుందన్నారు. డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, పాపన్నపేట్ ఎస్సై శ్రీనివాస్ గౌడ్, నాయకులు గౌరీశంకర్, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

మానిటర్‌లో సీసీ కెమెరాను పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

రోగులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్

డి.ధర్మారం పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరామ్

రామాయంపేట, ఫిబ్రవరి 11 : ప్రతి నిత్యం రోగుల సేవలోనే వైద్యులు ఉండాలని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ అన్నారు. మంగళవారం రామాయంపేట మండలం డి. ధర్మారం గ్రామంలోని పీహెచ్‌సీని సందర్శించిన ఆయన దవాఖానలోని వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దవాఖాన స్థితిగతులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఆపరేషన్ థియేటర్‌తో బాటు పేషంట్ల గదులను సందర్శించి డాక్టర్ హరిప్రియను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక కలెక్టర్ ఆదేశాలతో డి.ధర్మారం సీహెచ్‌సీని సందర్శించామన్నారు. దవాఖానలో ఉన్న ఆరోగ్య సిబ్బంది రోగులకు మెరుగైన అందించాలన్నారు. దవాఖానలో రోగులకు అందించే సేవల్లో ఏమాత్రం అశ్రద్ధ వహించవద్దన్నారు. ల్యాబ్‌కు సంబంధించి రోగులకు ఎప్పకప్పుడు రక్త నమూనాలు, ఇతర పరీక్షలు గానీ వెంటవెంటనే చేసి మంచి వైద్యం అందించాలన్నారు. రోగులకు సరపడా మందులు కూడా ప్రభుత్వం అందజేసిందని మాత్రలను ఎప్పటికప్పుడు రోగులకు ఇవ్వాలన్నారు. దవాఖానలో ఎక్కువ శాతం నార్మల్ డెలివరీలకే ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు.

మున్సిపల్ ఉద్యోగి సంజీవ్ మృతిపై మళ్లీ విచారణ

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 11 : మెదక్ మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సంజీవ్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పదేండ్ల నుంచి ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పారిశుధ్య విభాగంలో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్న సంజీవ్‌ను మూడు నెలల కింద పారిశుధ్య విభాగం అధికారులు జవాన్ విధుల నుంచి తప్పించి డంపింగ్ యార్డులో విధులు నిర్వహించాలని ఆదేశించారు. గత డిసెంబర్ 31న విధులకు వెళ్లిన సంజీవ్ రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో జనవరి 1న డంపింగ్ యార్డుకు వెళ్లి చూడగా షెడ్డులో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు మృతుడి సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియో బయటికి రావడంతో పాటు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో పోలీసులు చర్యలకు సిద్ధమయ్యారు. సంజీవ్ ఆత్మహత్యకు పాల్పడే ముందు సెల్ ఫోన్‌లో ఇద్దరు అధికారులతో పాటు సహచర సిబ్బంది ఒకరు వేధిస్తున్నారని వారిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేగాకుండా నా ఉద్యోగం నా కుమారుడికి ఇప్పించాలని సెల్ఫీ వీడియోలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత ముగ్గురిని పోలీసులు విచారించారు. మంగళవారం సంజీవ్ కుటుంబ సభ్యులను విచారించారు. ఈ విషయమై పట్టణ సీఐ నాగరాజును వివరణ కోరగా, కేసు విచారణ కొనసాగుతుందన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

నిరంతరం సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలి

చేగుంట, ఫిబ్రవరి11 : తెల్లారిందా కర్నాల్‌పల్లిలో కరెంట్ గోవిందా.. గోవిందా.. ఇక ఆఊళ్లో కరెంట్ కథ అంతే.. చేగుంట మండల పరిధిలోని కర్నాల్‌పల్లి బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై గ్రామంలోని సగానికి పై విద్యుత్ వినియోగదారుల కనెక్షన్లు ఉన్నాయి. గత 15 నుంచి 20 రోజులుగా తెల్లారిందంటే కరెంట్ పోతుంది. ఉదయం పూట పిల్లలు పాఠశాలకు వెళ్లే సమయంలో ఎక్కువ విద్యుత్ వాడకం వల్ల కరెంట్ ట్రిప్ అవుతుంది. దీంతో పాటు సాయంత్రం వేళా మూడు గంటల పాటు కరెంట్ పోవడంతో గ్రామంలో ప్రతి రోజు ఇలా జరుగుతుండడంతో గ్రామస్తులు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. విద్యుత్ అధికారులు స్పందించక పోవడంతో ప్రతిరోజు గ్రామస్తులు మరమ్మతులు చేసుకుంటున్నారు. విద్యుత్ శాఖాధికారుల స్పందించి నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యే విధంగా ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇట్టి విషయమై చేగుంట ట్రాన్స్‌కో ఏఈని వివరణ కోరగా, అందుబాటులోకి రాలేదు.

అందుబాటులో ఎరువులు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 11 : జిల్లాలో ఈ సీజన్‌కు అవసరమయ్యే ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయధికారి వినయ్ కుమార్ తెలిపారు. మంగళవారం మెదక్ పట్టణంలోని ప్రాథమిక సహకార సంఘంలోని ఎరువుల గోదాంలోని ఎరువుల నిల్వలతో పాటు రికార్డులను తనిఖీ చేసి పరిశీలించారు. నిబంధనలు పాటించని దుకాణాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ హన్మంత్‌రెడ్డి, మండల వ్యవసాయధికారి శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

కర్నాల్‌పల్లిలోని షిర్డీసాయిబాబా దేవాలయంలో స్వామివారికి కళషములతో అభిషేకం చేస్తున్న భక్తులు. -చేగుంట, ఫిబ్రవరి11

పౌష్టికాహారం అందించాలి

శివ్వంపేట, ఫిబ్రవరి 11 : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, తల్లులకు మంచి పౌష్టికాహారాన్ని అందించాలని సీడీపీవో హేమభార్గవి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని గోమారం, నవాబ్‌పేట, బిక్యతండా, పిల్లుట్ల అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. సూపర్‌వైజర్ సంతోష, వసుమతి ఉన్నారు.

కావాలనే బీసీ జనాభా కుదింపు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 11 : రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కావాలనే బీసీ జనాభాను తక్కువగా చూపిస్తున్నదని బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు మంగళవారం మండిపడ్డారు. కుల గణన సమగ్రంగా, శాస్త్రీయంగా నిర్వహించలేదని, తిరిగి సర్వే చేపట్టి కులాల వారీగా జనాభా జాబితాను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కామారెడ్డిలో ఎన్నికల సాక్షిగా మాట ఇచ్చిన రేవంత్‌రెడ్డి బీసీల డిక్లరేషన్ ఏమైందని ప్రశ్నించారు. కుల గణన నివేదికను సరిదిద్దేందుకు నిపుణులతో కమిటీ వేసి సవరించాలన్నారు. లేనిచో బీసీల పోరాటం తప్పదన్నారు.

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 11 : ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్ కేంద్రాల జాబితాను మంగళవారం ఎంపీడీవో దామోదర్ విడుదల చేశారు. విడుదల చేసిన పోలింగ్ కేంద్రాల జాబితాను ఎంపీడీవో కార్యాలయంలో నోటీస్‌బోర్డులో ఉంచారు. పోలింగ్ కేంద్రాలపై ఎవరైనా సలహాలు సూచనలు వెల్లడించవచ్చని తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

రామాయంపేట, ఫిబ్రవరి 11 : ఇంటర్‌లో విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలని ఇంటర్ బోర్డు జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి అన్నారు. మంగళవారం రామాయంపేటకు విచ్చేసి ఇంటర్ విద్యాధికారి కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్‌ను పరిశీలించి, లెక్చరర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వంద శాతం ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు.

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

బచ్చురాజ్‌పల్లిలో బాధితురాలికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాయకులు

నిజాంపేట, ఫిబ్రవరి 11 : మండలంలోని బచ్చురాజ్‌పల్లికి చెందిన రమావత్ పెంటికి రూ.15 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఈ మేరకు మంగళవారం స్థానిక నాయకులు బాధితురాలికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. నాయకులు సుధాం మల్లేశం, వినోద్, శ్రీనివాస్ నాయక్ ఉన్నారు.

చెక్‌డ్యామ్‌లో పొర్లుతున్న గోదావరి జలాలు

కొండపోచమ్మసాగర్ నుంచి వచ్చిన గోదావరి జలాలతో పొంగి పొర్లుతున్న వెల్దుర్తి శివారు హల్దీవాగుపై ఉన్న చెక్‌డ్యామ్

వెల్దుర్తి, ఫిబ్రవరి 11 : బీడు భూములు పచ్చని మాగాణులు కావాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ హయాంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఫలాలు నేటికి అందుతున్నాయి. వెల్దుర్తి, మాసాయిపేట మండలాల పరిధిలో ప్రవహించే హల్దీ వాగులోకి కొండపోచమ్మసాగర్ నుంచి నీటిని వదలడంతో రెండు రోజుల కింద మాసాయిపేట మండలంలోని హల్దీప్రాజెక్టులోకి వచ్చిన జలాలు సోమవారం సాయంత్రానికి హల్దీప్రాజెక్టు అలుగు పారింది. దీంతో సోమవారం మధ్యాహ్నానికి వెల్దుర్తి శివారు గంగమ్మ దేవాలయం వద్ద వాగుపై ఉన్న చెక్‌డ్యామ్ సైతం అలుగు పారి కిందికి ప్రవహిస్తుంది. దీంతో హల్దీవాగు పరివాహక ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కాళేశ్వరంపై అబద్ధాలు ప్రచారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి హల్దీవాగులో ప్రవహిస్తున్న గోదావరి జలాలే సమాధానం అని పలువురు రైతులు తెలిపారు.

దుకాణాదారులకు జరిమానా

నర్సాపూర్‌లో జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

నర్సాపూర్, ఫిబ్రవరి 11 : నర్సాపూర్ మున్సిపాలిటీలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వినియోగించినందుకు మున్సిపల్ అధికారులు మంగళవారం దుకాణాదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎన్వీరాన్‌మెంటల్ ఇంజినీర్ శ్రీకాంత్ మాట్లాడుతూ 120 మైక్రాన్స్ కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వినియోగించుట పూర్తిగా నిషేధించనున్నట్లు వెల్లడించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, వార్డు ఆఫీసర్లు ఉదయ్ కుమార్, రాములు, జవాన్ జేమ్స్, ఎల్లం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి

రామాయంపేట, మెదక్ రహదారిలో ఢీకొన్న కారు బైక్

రామాయంపేట, ఫిబ్రవరి 11 : రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ టీచర్ దుర్మరణం చెందిన సంఘటన రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామశివారులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. రామాయంపేట పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని అక్కన్నపేట గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సయ్యద్ సలాఉద్దీన్ (36) కాట్రియాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ టీచర్. పాఠశాల ముగిసిన తర్వాత తన బైక్‌పై దగ్గరలోనే ఉన్న అక్కన్నపేటకు మరో వ్యక్తితో కలిసి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యంలోని తొనిగండ్ల అటవీప్రాంతంలో ఎదురుగా వస్తున్న కారు అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టీచర్ సలాద్దీన్ మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. టీచర్‌కు మాత్రం కాళ్లు, చేతులు విరిగి, తలకు తీవ్రగాయమై రక్తస్రావమైంది. వెంటను స్థానికులు 108 అంబులెన్సులో రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో టీచర్ సలాఉద్దీన్‌ను వెంటనే కుటుంబీకులు హైదరాబాద్‌లోని దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మరో వ్యక్తి రామాయంపేట ప్రభుత్వ దవాఖానలోనే చికిత్స పొందుతున్నాడు. సలాఉద్దీన్ మృతి చెందడంతో మంగళవారం ఆయన పనిచేసే కాట్రియాల గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి. పాఠశాలలోని విద్యార్థులు టీచర్లు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు రామాయంపేట పోలీసులు ఎస్సై బాలరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా జాతర ఏర్పాట్లు

జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

పాపన్నపేట, ఫిబ్రవరి 11 : భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాతర ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. జాతర నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఏడుపాయల ఆలయం వద్ద పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు, పార్కింగ్ స్థలాలను తనిఖీ చేశారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్‌లు ఏర్పాటు చేయాలన్నా రు. రద్దీకి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ జామ్ లేకుండా వాహనాలకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్సై శ్రీనివాస్ గౌడ్, తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 11 : జిల్లా కేంద్రంలోని ప్రముఖ కిరాణా స్టోర్ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ పట్టణానికి చెందిన వ్యాపారి రమేశ్ అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రముఖుల సంతాపం..

ప్రముఖ వ్యాపారి సాయిదీప్ రమేశ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న నాయకులు రమేశ్ మృతదేహానికి నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, జిల్లా గ్రంథాల చైర్మన్ సుహాసినిరెడ్డి, మాజీ జడ్పీ ఉపాధ్యక్షురాలు లావణ్యారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, బట్టిజగపతి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఆంజనేయులు, ఆర్కే శ్రీనివాస్, మాజీ రైతు బంధు అధ్యక్షుడు సోములు, నాయకులు లింగారెడ్డి, శంకర్, దత్తు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల గుర్తింపు

కోహీర్, ఫిబ్రవరి 11 : మండలంలోని 13 ఎంపీటీసీ స్థానాలతో పాటు ఒక జడ్పీటీసీ స్థానానికి త్వరలో నిర్వహించే ఎన్నికల కోసం మంగళవారం కోహీర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో డ్రాఫ్ట్‌ను విడుదల చేశారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల కోసం 70 పోలింగ్ స్టేషన్లను గుర్తించినట్లు మండల పంచాయతీ అధికారి వినోద్ కుమార్ వెల్లడించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అంజయ్య, సిబ్బంది ఉన్నారు.

రజాక్‌పల్లిలో అంగన్‌వాడీ భవనం పరిశీలన

భవనాన్ని పరిశీలిస్తున్న మహిళా శిశువు సంక్షేమ శాఖ జిల్లా అధికారి హైమావతి

నిజాంపేట, ఫిబ్రవరి 11 : మండలంలోని రజాక్‌పల్లిలో నిర్మాణ దశలో ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని మహిళా శిశువుసంక్షేమ శాఖ జిల్లా అధికారి హైమావతి మంగళవారం పరిశీలించారు. భవన నిర్మాణానికి సంబంధించిన పనుల వివరాలను డీఈతో మాట్లాడారు. అనంతరం ఆమె స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పలు రికార్డులను పరిశీలించారు. పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో స్వరూపరాణి, సూపర్‌వైజర్ లక్ష్మి, సిబ్బంది మధుకర్, తదితరులు ఉన్నారు.

తిరుమల స్వామి ఆలయ హుండీ లెక్కింపు

నిజాంపేట, ఫిబ్రవరి 11 : చల్మెడ తిరుమల స్వామి బ్రహ్మోత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కలు తీర్చుకొని హుండీలో కానుకలు సమర్పించుకున్నారు. ఈ మేరకు మంగళవారం తిరుమల స్వామి ఆలయ ఆవరణలో ని